నేడు రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : అన్ని రైతువేదికల్లో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 52 రైతు వేదికల్లో రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈమేరకు రైతు వేదికల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నీట్‌లో హన్సిక ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : నీట్ ఫలితాల్లో మండలంలోని ఈదులపూసపల్లికి చెందిన బత్తిని శ్రీనివాస్ – కృష్ణవేణి దంపతుల కుమార్తె హన్సిక ప్రతిభ కనబరిచింది. వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుని ఆల్ ఇండియా 413వ ర్యాంక్ సాధించింది. విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపాద సంతోష్ కృపాకరాచార్యులు, ప్రముఖులు, స్నేహితులు అభినందించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : ఇంట్లో బస్తాల్లో నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను టౌన్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. టౌన్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇల్లందు రోడ్‌లో ఓ ఇంట్లో పట్టణానికి చెందిన ప్రశాంత్, గూడూరు మండలం బొద్దుకొండకు చెందిన అశోక్ గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచగా విశ్వనీయ సమాచారం మేరకు తనిఖీ చేశారు. గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

గూడూరు, జూన్ 15: ఆటో, బైక్ ఢీకొని బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దామరవంచ క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. విశ్వనీయ సమాచారం మేరకు.. ఏపూరు గ్రామం టేకులతండాకు చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై ఏపూరు వెళ్తున్నారు. ఇదే సమయంలో దామరవంచకు చెందిన ఆటో అదే గ్రామానికి వెళ్తోంది. దామరవంచకు వెళ్లే క్రాస్‌రోడ్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తరుణ్, హేమంత్, యశ్వంత్ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి స్థానికులు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం వరంగల్‌కు తరలించారు.

కారు ఢీ.. ఇద్దరి తీవ్రగాయాలు

మరిపెడ, జూన్ 15: కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని బురహాన్‌పురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యపేట జిల్లా తాటిపాముల గ్రామానికి చెందిన షేక్‌జమీలా బురహాన్‌పురంలో బంధువు అంత్యక్రియలకు వచ్చారు. సమీప బంధువు షేక్‌సలీమ్‌తో బస్సు ఎక్కేందుకు స్టేజీ వద్ద వేచి ఉన్నారు. కారు వేగంగా సూర్యపేట నుంచి మరిపెడకు వస్తూ వారిపైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం స్థానికులు 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SHAMALA RAMESH @ SAMALA RAMESH S/o Veeraiah, R/o. H.No. 4-17, Kothaguda Village and Mandal, Mahabubabad Dist - 506391 T.G. Changed my name from SHAMALA @ SAMALA RAMESH to SHAMALA RAMESH @ SAMALA RAMESH for all purposes.

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

అసంపూర్ణం.. అస్తవ్యస్తం

- అధ్వానంగా ఎన్‌హెచ్-930పీ ప్యాచ్ వర్క్స్
- మంజూరైన రూ.2.94కోట్ల నిధులు
- గడువులోగా పూర్తిచేయని కాంట్రాక్టర్
- పూడ్చిన కొద్దిరోజులకే గుంతల్లో కొట్టుకుపోయిన తారు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- విస్తరణ ఆలస్యంతో జిల్లా వాసుల నిరాశ

బయ్యారం – సత్యనారాయణపురం మధ్య గుంతలమయంగా ఎన్‌హెచ్–930పీ

బయ్యారం, జూన్ 15: ఎన్‌హెచ్–930పీ ప్యాచ్ వర్క్స్ అసంపూర్ణంగా, అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో ఈ దారిలో వెళ్లాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ బైపాస్ రోడ్డు సమీపంలోని గౌరెల్లి జంక్షన్ (వలిగొండ) నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వరకు 234 కిలోమీటర్లు ఈ రహదారి ఉంది. జిల్లాలో తొర్రూరు నుంచి భద్రాద్రి కొత్తగూడెం (వయా మహబూబాబాద్, బయ్యారం) వరకు సుమారు 69 కిలోమీటర్ల విస్తరించి ఉంది. ఈ రోడ్డు ప్యాచ్ వర్క్స్ కోసం గత ఏడాది మార్చిలో రూ.2.94కోట్ల నిధులు మంజూరు కాగా హనుమకొండకు చెందిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రహదారిపై గుంతలు పూడ్చటం, సైన్‌బోర్డుల ఏర్పాటు, జంగిల్ కటింగ్, బ్రిడ్జిల రెయిలింగ్‌కు పెయింటింగ్, మరమ్మతులు చేయాల్సి ఉంది. ఏడాది లోగా పనులు పూర్తి చేసి, ఆరు నెలల పాటు మెయింటేన్ చేయాల్సి ఉంటుంది. కానీ రహదారిపై గుంతల పూడ్చివేత (ప్యాచ్ వర్క్) పనులు చేయగా మిగతా పనులు పూర్తి చేయలేదు. పూడ్చిన గుంతలు కొన్ని చోట్ల కొద్ది రోజులకే తారు కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ప్యాచ్ వర్క్స్ అసంపూర్తిగా ఉండగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ టూ భద్రాచలం ప్రధాన రహదారి కావటంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇరువైపులా చెట్లు పెరగటంతో రహదారి సరిగా కనిపించకపోవటం, మూల మలుపుల వద్ద సైన్‌బోర్డులు లేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిలో ఉన్న బ్రిడ్జిల రెయిలింగ్‌లు విరిగిపోవటం, కలర్లు వేయకపోవడంతో బ్రిడ్జిలు అందవిహీనంగా తయారయ్యాయి. గడువు ముగిసినప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంతో అసంపూర్ణంగా, చేసినవి అస్తవ్యస్తంగా ఉండటంపై విమర్శలు వస్తున్నారు.

విస్తరణ కోసం నిరీక్షణ

ఎన్‌హెచ్–930పీ విస్తరణ కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని తొర్రూరు నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నెహ్రూనగర్ (నామాలపాడు) వరకు (69 కిలోమీటర్ల రహదారికి) విస్తరణ కోసం 2023లోనే ఢిల్లీలోని మినిస్టరీ ఆఫ్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ హైవేస్ నుంచి డీపీఆర్‌ను అప్రూవల్, రూ.675.45కోట్లు మంజూరు కాగా ఇప్పటికీ టెండర్లు కాల్‌ఫర్ చేశారు. భూసర్వే, విద్యుత్ లైన్లు, చెట్ల తొలగింపు సర్వే, మూడు బైపాస్‌లకు భూసేకరణ పూర్తి చేసిన అధికారులు నివేదిక అందించారు. గత ఆర్థిక సంవత్సరం నిధుల సర్దుబాటు ఇబ్బంది కారణంగా టెండర్ల పరిశీలన దశలోనే రహదారి ప్రక్రియ నిలిపివేయాలని కేంద్రం ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించటంతో విస్తరణ నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మార్చి తర్వాతే పనులు ప్రారంభమవుతాయని అందరూ భావించినప్పటికీ పనుల్లో పురోగతి మాత్రం లేదు. ఈ రహదారి విస్తరణ పూర్తయితే హైదరాబాద్‌కు వెళ్లే జిల్లా వాసులకు ప్రయాణం సాఫీగా సాగనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, అశ్వాపురం, మణుగూరు వాసులకు సుమారు 40కిలోమీటర్ల దూరం భారం తగ్గనుంది.

చెట్లు పెరిగిన బ్రిడ్జి రెయిలింగ్

రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం

ఎన్‌హెచ్– 930పీ ప్యాచ్ వర్క్స్ రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం. గుంతలు పూడ్చడం, జంగిల్ కటింగ్ పనులు పూర్తయ్యాయి. చేసిన పనులకు రూ.కోటి బిల్లు మంజూరు చేశాం. ఇంకా రెండు నెలల పాటు మెయింటెనెన్స్ పీరియడ్ (డీఎస్పీ) ఉంది. ఈలోగా పూర్తి స్థాయి పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

– అమీర్‌పాషా, డీఈ, నేషనల్ హైవేస్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని జీపీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల లాభాల కోసమే పనిచేస్తోంది, కార్మికులను బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికులు మల్టీపర్పస్ వర్కర్ విధానంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వంగూరి రాములు, సుధాకర్, ఆకుల రాజు, నాగన్న, రాజమౌళి, మల్లయ్య పాల్గొన్నారు.

లింక్‌లపై క్లిక్ చేసి మోసపోవద్దు

నెల్లికుదురు, జూన్ 15: సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లపై క్లిక్ చేసి మోసపోవద్దని స్థానిక ఎస్సై చిర్ర రమేశ్‌బాబు సూచించారు. పోలీసు స్టేషన్‌లో ఆదివారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. పీఎం కిసాన్, ముద్ర లోన్స్ తదితర పేర్లతో సైబర్ నేరగాళ్లు వలవేస్తున్నారని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్లు మాత్రమే వినియోగించాలని సూచించారు. వాట్సాప్, ఎస్ఎంఎస్‌లలో వచ్చే లింక్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యాశకు పోతే ఉన్న డబ్బులు పోతాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలతో మోసపోవద్దని తెలిపారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి

డోర్నకల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డోర్నకల్/గార్ల, జూన్ 15: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని మసీదు సెంటర్‌లో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలు జరపాలని కోరారు. న్యూడెమోక్రసీ కురవి సబ్ డివిజన్ కార్యదర్శి యాస వెంకటనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్, లింగన్న, దేవేందర్, దాసరి మల్లేశం, వెంకన్న పాల్గొన్నారు. 'ఆపరేషన్ కగార్'ను ఆపాలని గార్ల మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. న్యూడెమోక్రసీ నాయకులు జడ సత్య నారాయణ, జీ. సక్రు, మాన్య నాయక్, మనోహర్ పాల్గొన్నారు.

ఎర్రబెల్లి బర్త్ డే సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రశంసాపత్రం అందుకుంటున్న నీతారాములు

తొర్రూరు, జూన్ 15: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బర్త్ డేను పురస్కరించుకొని, ఏటా మాదిరిగానే ఈసారి కూడా ముందస్తుగా హనుమకొండలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈమేరకు బీఆర్ఎస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు రక్తదానం చేయగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పార్టీ తొర్రూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : పట్టణంలోని గిరిజన భవనంలో రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిసినట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జితేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ కొమ్ము రాజేందర్, రావుల మురళి, సాంబమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కురవి, జూన్ 15: టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంఘం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలు జూన్ 21, 22వ తేదీల్లో నిజామాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. నర్సయ్య, సైదులు, వెంకటయ్య, మరియ, లక్ష్మి, సుజాత, యాకమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, తాగునీటి సౌకర్యం, సరిపడ టాయ్‌లెట్లు, ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోనగిరి మధు, మహేశ్, గణేశ్, దిలీప్, జయంత్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడు రంగన్నను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు చౌడవరపు రంగన్నను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ముస్లిం జేఏసీ రాష్ట్ర సెక్రటరీ అహ్మద్‌ఖాన్ కోరారు. ఆదివారం పట్టణంలో కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న రంగన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో రంగన్న చురుగ్గా పాల్గొన్నారని, ఇటీవల పక్షవాతంతో పలుమార్లు హాస్పిటళ్లకు వెళ్లినా నయం కాలేదని, వారి కుటుంబాన్ని రాజకీయ నాయకులు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చెక్కల అశోక్, రాము వెంకన్న పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలు'

కేసముద్రం, జూన్ 15: ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు కాకుండా తమ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మంజూరు చేసి అవకతవకలకు పాల్పడ్డారని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు కొండపల్లి రాకేశ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికార పార్టీకి చెందిన వారికి, సన్నిహితంగా ఉన్న వారికి, ఆర్థికంగా స్థిరపడిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన వారికి అన్యాయం చేశారని తెలిపారు. రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, రైతుభరోసా అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు.

లక్ష్మయ్య కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న రాంసింగ్

గార్ల, జూన్ 15: పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన నిరుపేద చెరుకుపల్లి లక్ష్మయ్యకు ఇన్‌కం టాక్స్ రిటైర్డ్ ఉద్యోగి గంగావత్ రాంసింగ్‌నాయక్ ఆదివారం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. మధు, చిట్టిబాబు, పత్యా, హరిప్రసాద్, సతీశ్, వెంకన్న పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యానికి ఎంతో మేలు

- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- చక్రి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

రక్తదాన క్యాంపును సందర్శించిన ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : రక్తదానం ఆరోగ్యానికి ఎంతో మేలు అని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో సుశృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రవీందర్ చౌకీదార్ ఆధ్వర్యంలో సంగీత దర్శకుడు చక్రి జయంతిని ఘనంగా నిర్వహించి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ రవీందర్ రావు, సంధ్యారాణి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై చక్ర చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కంబాలపల్లిలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన చక్రి అనతి కాలంలోనే అనంత కీర్తి ప్రతిష్టలు సంపాదించి సంగీత రంగంలో ఉన్నతమైన స్థానానికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అనేక పాఠశాల, కళాశాల విద్యార్థులకు పాటలు, సంగీతం నేర్పించారని తెలిపారు. చక్రి అకాల మృతి ఈ ప్రాంతానికి తీరని లోటు అన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల వేణుమాధవ్, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, అంబరీష, మడత వెంకన్న, గోపీ, శివ, శంకర్ పాల్గొన్నారు.

చక్రి స్వగ్రామంలో..

మహబూబాబాద్ రూరల్: సంగీత దర్శకుడు చక్రి జయంతి స్వగ్రామం కంబాలపల్లిలో ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులు నిర్వహించారు. చక్రి అక్క వాణీదేవి ఆధ్వర్యంలో చక్రి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అన్నదానం నిర్వహించారు. ఇందుభారతి, మల్లం యశ్వంత్, వినయ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో ఘనంగా ఫాదర్స్ డే

అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్నారై సునీల్‌రెడ్డి

తొర్రూరు/ పెద్దవంగర, జూన్ 15: బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకుడు, ఎన్నారై (ఆస్ట్రేలియా) పాకనాటి సునీల్‌రెడ్డి ఆదివారం తన తండ్రి పాకనాటి సోమనర్సింహారెడ్డి జయంతి సందర్భంగా స్థానిక అనాథ ఆశ్రమంలో ఫాదర్స్ డే ఘనంగా నిర్వహించారు. తొర్రూరు పట్టణంలోని సెయింట్‌పాల్ స్కూల్ ఆవరణలో ఉన్న అనాథ ఆశ్రమంలో పిల్లలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. తొర్రూరు మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పెద్దవంగర మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాంసంజయ్, పార్టీ తొర్రూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, పెద్దవంగర నాయకులు శ్రీరాం సుధీర్, కాలునాయక్, మయూరి వెంకన్న, కర్నె నాగరాజు, ధరావత్ జైసింగ్, గుగులోత్ శంకర్, దుంపల వేణు, తొర్రూరు బీఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు యర్రం రాజు, పెద్దవంగర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మైలపాక అనిల్, ఆవుల ఉపేందర్ పాల్గొన్నారు. కాగా, పెద్దవంగర అంబేద్కర్ చౌరస్తాలో పాకనాటి సోమనర్సింహారెడ్డి 83వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నేత, ఎన్నారై పాకనాటి సునీల్ కుమార్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ నిరుపేదలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, సుధీర్‌కుమార్, వెంకన్న, రఘు, విజయా శ్రీనివాస్, రాము, అనిల్, అనుదీప్, స్వామి, సతీశ్, యాకయ్య, ఐలమల్లు, యాకభిక్షం పాల్గొన్నారు.

తండ్రీ కొడుకు విగ్రహాల ఆవిష్కరణ

బాల్యనాయక్, సాయికృష్ణ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, జూన్ 15: మండలంలోని దుబ్బతండా మాజీ సర్పంచ్ అజ్మీరా భారతి భర్త బాల్యానాయక్(50), ఏకైక కుమారుడు సాయికృష్ణ(17) ఈనెల 5న ఖమ్మంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా దశదిన కర్మ ఆదివారం జరిగింది. కాగా, తమ ఇంటి సమీపంలో తండ్రీ కొడుకు విగ్రహాలను నిర్మించగా మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ హాజరై ఆవిష్కరించారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాధితురాలిని ఓదార్చి ధైర్యం చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షరెడ్డి, మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు నంజ్యాల మధు, కళ్లెపు సతీశ్ కుమార్‌గౌడ్, బానోత్ కోటి శంకర్, కాలా యశోధర్ జైన్, కాడెం బాబు, కాసం వెంకన్న, కాడెం ప్రశాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

షీల్డ్, ప్రశంసాపత్రం అందుకుంటున్న రవివర్మ

ఇనుగుర్తి, జూన్ 15: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన రవివర్మ ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఎం జితేందర్‌రెడ్డి, అంతర్జాతీయ బాడ్మింటన్ అంపైర్ కొమ్ము రాజేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14, 15న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో మండల కేంద్రానికి చెందిన రవివర్మ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ప్రథమ స్థానం సాధించి ఈనెల 24, 25న హైదరాబాద్‌లో రైల్వేస్ క్లబ్(ఆర్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో సీఐ నర్సయ్య, రాష్ట్ర బాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు పింగిళి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు రమేశ్‌రెడ్డి, నాగకిషన్, వద్దిరాజు వెంకటేశ్వర్లు, సాంబమూర్తి, కొప్పుల శంకర్, కిశోర్, శ్యామ్, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రమేశ్ (ఫైల్)

తొర్రూరు, జూన్ 15: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఒకరు ఆదివారం మృతిచెందారు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సర్వి రమేశ్(42) శనివారం రాత్రి తన బైక్‌పై స్థానిక బస్టాండ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి అన్నారం రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న జఫర్‌గఢ్ మండలానికి చెందిన జువారి బన్నీ బైక్ ఢీకొనడంతో రమేశ్ తలకు తీవ్ర గాయమై చెవిలో నుంచి రక్తస్రావమైంది. స్థానికులు తొలుత వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 11.45గంటలకు మృతిచెందాడు. మృతుడి అన్న వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీశ్రీ సేవలు చరిత్రాత్మకం

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : సాహిత్యంతో శ్రీశ్రీ చేసిన సేవలు చరిత్రాత్మకమైనవని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సమ సమాజ స్థాపన కోసం కృషిచేసిన మహాకవి అని, ఆయన రచించిన మహాప్రస్థానం, మరో ప్రస్థానం ఎంతో ప్రాముఖ్యమైనవని తెలిపారు. లక్ష్మీ కాంతారావు, నీలం వెంకటేశ్వర్లు, కీర్తనారెడ్డి, వాసవి అశ్వని, పూజి